క్లుప్తంగా

అధ్వానంగా సర్వీసురోడ్డు



మల్కాపురం సర్వీసురోడ్డుపై చేరిన మట్టి

ఫోకస్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సర్వీసురోడ్డు అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై మట్టి, ఇసుక చేరాయి. వాటిని పారిశుధ్య కార్మికులు తొలగించకపోవడంతో వర్షం వచ్చేటప్పుడు దానిపైకి నీరు చేరి బురదమయంగా మారుతుంది. సమస్యపై అధికారులు స్పందించాలని పాదచారులు కోరుతున్నారు.

యువతకు ఉచితంగా ఉపాధి శిక్షణ

గాజువాక: ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగిన 18 నుంచి 28 ఏళ్ల లోపు యువతీ యువకులకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు నిర్మాణ్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ మయూర్ పట్నాల తెలిపారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జావా ఫుల్‌స్టాక్, టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్, కమ్యూనికేటింగ్ ఇంగ్లిష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎఫ్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నాలజీ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్‌లో మూడు నెలలపాటు శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆ తర్వాత ఉచితంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 9154938478, 9154938472 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం వైభవంగా 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆలయ కార్యనిర్వహణాధికారి కె. శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది హాజరయ్యారు.

క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యంగా..



గొల్లకంచరపాలెంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి ఆర్పీపేట అర్బన్ పబ్లిక్‌హెల్త్ సెంటర్ సిబ్బంది, టీబీ యూనిట్ సంయుక్తంగా మంగళవారం క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. దేశవ్యాప్తంగా క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం టీబీ ముక్త్ భారత్ అభియాన్ క్యాంపెయిన్ ప్రారంభించిందని వైద్యురాలు లిఖిత చెప్పారు. గొల్లకంచరపాలెం శ్రీకృష్ణమందిరం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో టీబీ పరీక్షలు, షుగర్ వంటి పరీక్షలు చేశారు. సిబ్బంది శరత్ బాబు, పైడిరాజు, యూపీహెచ్‌సీ హెచ్‌వీ భారతి, ఏఎన్ఎంలు భారతీ, మణి, ఆశా వర్కర్లు పుష్ప, సుబ్బలక్ష్మి, గోక స్వాతి పాల్గొన్నారు.

జీఎం దృష్టికి ఉక్కు టౌన్‌షిప్ సమస్యలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో పెరిగిపోతున్న సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని 78వ వార్డు కార్పొరేటర్ బి. గంగారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మినిస్ట్రేషన్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. టౌన్‌షిప్ క్లస్టర్లలో జంగిల్ కటింగ్ సక్రమంగా లేకపోవడం, కటింగ్ చేసిన వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించక పోవడంతో క్వార్టర్లలోకి పాములు చొరబడి కాటు వేస్తున్నాయన్నారు. రెండు రోజుల కిందట సెక్టార్-11లో నివాసం ఉంటున్న తగరంపూడి శ్రీనివాసరావు పాము కాటుకు గురై మరణించడం బాధాకరమన్నారు. చెత్త కుండీలు క్రమం తప్పుండా శుభ్రం చేయకపోవడంతో పారిశుధ్యం లోపిస్తుందని వివరించారు.



జయప్రకాష్‌నగర్ రైల్వే కల్వర్టు వద్ద పేరుకు పోయిన వ్యర్థాలు



కొత్తపాలెం గెడ్డలో వ్యర్థాలు



కొత్తపాలెంలో మరో గెడ్డలో దుస్థితి

ప్లాస్టిక్ భూతం!

- శివారులో పొంచి ఉన్న ప్రమాదం
- భారీగా పోగు పడిన ప్లాస్టిక్ వ్యర్థాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పర్యావరణ ప్రేమికులు



బుచ్చిరాజుపాలెం రైల్వే ట్రాక్ వద్ద పేరుకు పోయిన వ్యర్థాలు

అమ్మో మహమ్మారి... గ్రామ శివార్లలో కాపుకాసుకుని ఉంది... భూమితో పాటు భూమిపై నివసించే వారిని కబళించుకుపోయేందుకు చూస్తోందని స్థానికులు, పర్యావరణ ప్రేమికులు వాపోతున్నారు. మేల్కొకక పోతే మూల్యం చెల్లించుకోక తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 89, 90, 91, 92 వార్డుల పరిధిలో పలు చోట్ల ప్లాస్టిక్ వ్యర్థాలు కలవరపడుతున్నాయి. కాల్వలు, గెడ్డలో వచ్చిన వ్యర్థాలు శివారు ప్రాంతాల్లో పేరుకు పోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పంట పొలాల్లోకి చేరి వ్యవసాయ భూములను నిస్సారంగా మారుస్తున్నాయి. వర్షాలు పడితే కాల్వలు శుభ్రమైపోతాయన్న ఆలోచనతో అధికారులు వ్యర్థాలు తొలగించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని, ప్రకృతి సమతుల్యత పాడవుతుందని చెబుతున్న మాటలు వ్యర్థాలుగా మారుతున్నాయని వాపోతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించడంతో పాటు ప్లాస్టిక్ అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

- గోపాలపట్నం

వేడుకగా దుర్గాలమ్మ జాతర



దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న మళ్ల విజయప్రసాద్

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు కంచరపాలెం దరి ఆకాశవానిపాలెంలో దుర్గమాంబ జాతరను గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలు మళ్ల విజయప్రసాద్‌కు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందించారు. సాయంత్రం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. దుర్గమ్మ ఘటాలను ఊరేగించారు. కార్యక్రమంలో అప్పలరాజు, శ్రీనివాసరావు, ధనరాజు, పేడాడ జ్యోత్స్న, కె.సత్తిబాబు, శ్యామ్, అర్జున్ పాల్గొన్నారు.

నేత్ర పర్వం.. సిరిమానోత్సవం



పురవీధుల్లో సిరిమానోత్సవం



సిరిమాను వద్ద ఆలయ కమిటీ పెద్దలతో గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి

కూర్మన్నపాలెం: వడ్లపూడి వాసుల ఆరాధ్య దేవత రథాలమ్మ ఉత్సవం మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా సాగింది. మేళతాళాలు, భాజా భజంత్రీలు నడుమ రామాలయం వద్ద రాత్రి 9 గంటల ప్రాంతంలో సిరిమాను రథం కదిలింది. సిరిమానును పూజారి ప్రగడ అప్పలనాయుడు అధిరోహించగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ముందుకు నడిపించారు. వేలాదిమంది భక్తులు హర్షధ్వానాల మధ్య జరిగిన కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఇతర ప్రముఖులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం రథం ముందు పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, నాయకులు కోమటిశ్రీను,గుడివాడ లతీష్,ప్రగడ వేణు, బొడ్డగోవింద్,దానప్పలు తదితరులు రథాన్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, కళారూపాలు ఆకట్టుకున్నాయి.

జగన్ ప్రభంజనాన్ని చూడలేకే కుట్రలు

- పక్క పార్టీలను నమ్ముకుని జగన్ రాజకీయం చేయరు
- జనమే అతని బలం
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల



సమావేశంలో మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్

మల్కాపురం: మా నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలనే నమ్ముతారు.. చంద్రబాబు మాదిరి పక్క పార్టీలపై ఆధారపడి రాజకీయాలు చేయరని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ అన్నారు. 61 వార్డు మల్కాపురం దరి రెడ్డివీధిలో మంగళవారం వార్డు నాయకులు,కార్యకర్తలు, అనుబంధ సంస్థల ప్రతినిధులు,బూత్ కమిటీ కన్వీనర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు పిలక రామోహన్‌రెడ్డి(పిలక రాము) ఆధ్వర్యంలో పార్టీ నగర కార్యదర్శి పీలా అనంత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశానికి అతిథిగా పాల్గొన్న మళ్ల విజయప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అభివృద్ధి శూన్యం అన్నారు. అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ఉన్న ప్రేమ ప్రజా సంక్షేమంపై చంద్రబాబుకు లేదన్నారు. యువతకు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అని ఎన్నికల్లో ప్రచారం చేసి ఓట్లు వేయించుకున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్,లోకేష్‌లు అధికారంలోకి వచ్చిన తర్వాత యువతను మోసం చేశారని ఆరోపించారు. తల్లికి వందనం కూడా కొందరి తల్లులకే పరిమితం అయిందని, అదీ కూడా రెండు వేల రూపాయల కోతతో అని ఆక్షేపించారు. ప్రచారాలకు కోట్ల రూపాయలు వృథా చేస్తున్న సీఎం చంద్రబాబు విద్యార్థులకు ఫీజు రియంబర్స్ మెంట్ ఇవ్వడం మరిచారన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో సంక్షేమం

జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కరోనా వంటి విపత్తు వచ్చినా పేద ప్రజలకు అనుకున్న సమయానికి పథకాలు నేరుగా ఇంటికి అందించే వారని గుర్తు చేశారు. ఏడాది కూటమి పాలనపై ప్రజలు విసుగు చెందారని,అందుకు ఉదాహరణ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన సభలు, కార్యకర్తలను పరామర్శించేందుకు వెళ్లినప్పుడు వస్తున్న జనమే నిదర్శనమని వివరించారు. జగన్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను తట్టుకోలేక ... చంద్రబాబు తన అనుకూల మీడియా ద్వార తప్పుడు ప్రచారాలు చేయిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే యత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదన్నారు.అందుకు ఉదాహరణ చంద్రబాబు నియోజకవర్గంలో ఓ మహిళను చెట్టుకు కట్టి కొట్టడమే అని వివరించారు.

కార్యకర్తలకు న్యాయం

పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు న్యాయం చేస్తామని మళ్ల హామీ ఇచ్చారు. రానున్న రోజులు మనవే అని,నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను వేధిస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు పార్టీ అధ్యక్షుడు జి.వి.ఎస్.ఎన్.రాజు(కేబుల్ వాసు),మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు,ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం, నాయకులు కొల్లి నూకరెడ్డి,ఎస్.వి.రమణ,బూస అప్పలరెడ్డి,చట్టి నూకరాజు,మంగ,పిలక వరలక్ష్మి,బూస వెంకటలక్ష్మి,విజయ్ పాల్గొన్నారు.

ఆకతాయిల బెడద తొలగించాలి

- సీఎం పేషీకి కొత్తపాలెం వాసి ఫిర్యాదు
- ఫిర్యాదు ఉపసంహరించుకోవాలని ఒత్తిడి
- ఇల్లు కూలగొడతామని బెదిరిస్తున్నారని బాధితుడి ఆరోపణ



షెడ్ వేసేందుకు రేకులు దించుతున్న దృశ్యం(ఫైల్)



ఆకతాయిలు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం జంక్షన్‌లో ఆకతాయిలు, మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయని స్థానికులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విచ్చల విడిగా మద్యం లభించడంతో బహిరంగంగా సేవిస్తూ రోడ్లపై వీరంగం సృష్టిస్తున్నారు. దీనికి కొత్తపాలెం జంక్షన్‌లో తలెత్తిన వివాదమే నిదర్శనం.

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. దీనికి ఎదురుగా గెడ్డ స్థలంలో దుకాణాలు కూడా వెలశాయి. మందుబాబులు ఈ దుకాణాల వద్ద బహిరంగంగా సేవిస్తుంటారు. మత్తు తలకెక్కిన తర్వాత ఇళ్లపై దాడులు చేయడం.. బీరు సీసాలను రోడ్లపై కొడుతున్నారని వాపోతున్నారు. మందుబాబుల చర్యల వల్ల తమ ఇంటి కిటికీ అద్దాలు విరిగి పోయాయని.. డాబాపైకి ఎక్కి గొడలు విరిచేశారని స్థానికుడు డబ్బీరు శ్రీనివాసరావు ప్రజా సమస్యల పరిష్కారవేదికకు(సీఎం పేషీకి) ఫిర్యాదు చేశాడు. ఆకతాయిలు, మందుబాబులు చేపసిన పనులు సీసీ టీవీ ఫుటేజీలు సైతం జత చేసి పంపించాడు. దీంతో యంత్రాంగంలో కదలిక వచ్చింది. విచారణ ప్రారంభించారు. అయితే అంతలోనే సీన్ మారిపోయింది. ఫిర్యాదు వెనక్కి తీసుకోకపోతే ఇల్లే కూల్చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారని బాధితుడు శ్రీనివాసరావు వాపోతున్నారు. గెడ్డ స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని.. అక్కడికి ఆకతాయిలు చేరి బహిరంగంగా మద్యం సేవిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోతున్నాడు. ఇటీవలే వారి ఆగడాలకు అడ్డగా మార్చుకునేందుకు రాత్రికి రాత్రే షెడ్డు నిర్మించేశారని స్థానికులు, బాధితులు చెబుతున్నారు. స్థానికులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మందుబాబుల ఆగడాలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

గుడ్ టచ్ ..బ్యాడ్ టచ్‌పై అవగాహన



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న హెచ్‌సీ వెంకటరావు

గోపాలపట్నం: గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు తల్లులు వివరించాల్సిన ఆవశ్యకత ఉందని శక్తి టీమ్ పోలీసులు తెలిపారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో మంగళవారం శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ పృథ్వీతేజ నేతృత్వంలో శక్తి టీమ్ సీఐ మల్లేశ్వరి, ఎస్ఐ దివ్యభారతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని హెచ్‌సీ వెంకటరావు తెలిపారు. బయటకు వెళ్లినపుడు అపరచితులపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లల కదలికలపై నిత్యం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కొంత మంది వ్యక్తులు ముట్టుకునేటప్పుడు వారు ఏ ఉద్దేశంతో పట్టుకున్నారో గుర్తిచాలని సూచించారు. విద్యార్థులు ఏ విషయమైనా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చెప్పడానికి మొహమాట పడవద్దని సూచించారు. పిల్లలతో ఉపాధ్యాయులు స్నేహ పూర్వకంగా ఉండాలని... వారి ఇబ్బందులు అడిగి తెలుసుకోవాలన్నారు. ప్రమాదంలో ఉన్నపుడు శక్తియాప్ అండగా ఉంటుందన్నారు. యాప్ ఉన్న మొబైల్‌ను 5 మార్లు షేక్ చేస్తే కంట్రోల్ రూమ్‌కు అలర్ట్ వెళ్తుందని వివరించారు. దీంతో పోలీసులు మొబైల్ లొకేషన్ ఆధారంగా బాధితురాలి వద్ద చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు జగన్నాథం, ప్రసాద్, లీలా, పార్వతీ దేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ మారువారం



ప్రత్యేక అలంకరణలో పైడిమాంబ

కంచరపాలెం: జీవీఎంసీ 54,57 వార్డుల పరిధి ఐటీఐ జంక్షన్ సుంకురపేట ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబ అమ్మవారి మారువారంను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీనివాసశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు పిల్లి చంద్రశేఖర్, పిల్లి నాగమణి, సీతారామ్, శోభారాణి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. మారువారం జాతర సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పిల్లి మురళీకృష్ణ, పితాని రమణ, అప్పలరాజు, సముద్రాలు, శ్రీను, నూకరాజు, బాలు, కుమారు, లాలూ, శశాంక్, రాజా, బుజ్జి, సూరిబాబు, రామకృష్ణ, వెంకటరావు పాల్గొన్నారు.

హియరింగ్ ఎయిడ్ మిషన్ల పంపిణీ



రోగి చెవికి మిషన్ అమర్చుతున్న ముప్పిన ధర్మేంద్ర

మల్కాపురం: వినికిడి సమస్యతో బాధపడుతున్న నిరుపేద వృద్ధులకు వైద్యుడి సలహా మేర అవసరమైన వినికిడి మిషన్లు (హియరింగ్ ఎయిడ్ మిషన్లు) 58వ వార్డు ప్రాంతానికి చెందిన ముప్పిన ధర్మేంద్ర మంగళవారం అందించారు. శ్రీహరిపురం వద్ద జరిగిన కార్యక్రమంలో సామాజిక సేవా కార్యకర్త ముప్పిన ధర్మేంద్ర మాట్లాడుతూ వినికిడి సమస్య ఉన్న వృద్ధులు రోడ్డు దాటే సయయాల్లో చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇలాంటి వారిని గుర్తించి వారికి అవసరమైన మిషన్లు అందించినట్టు చెప్పారు.

కార్మికుల హక్కుల సాధనకు సార్వత్రిక సమ్మె



నిరసన చేపడుతున్న ఆటో కార్మికులు, చిల్లర వర్తకులు

సీతంపేట : కార్మికుల హక్కుల సాధనకు వచ్చే నెల 9న దేశ వ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద ఆటో డ్రైవర్లు, చిల్లర వర్తకులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా కేంద్ర ప్రభుత్వం మార్చి కార్మికుల శ్రమను దోపిడీ చేస్తోందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా రైతాంగానికి గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా రైతులను మోసం చేస్తుందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరిస్తూ, బడా కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచి పెడుతున్నాయన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే ఆటోడ్రైవర్లు అండ్ మోటార్ కార్మికులకు వాహనమిత్ర రూ.15వేలు ఇస్తామని, జరిమానాలు పెంచే జీవోలు 21, 31 రద్దు చేస్తామని, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గిస్తామని, గ్రీన్ టాక్స్ రద్దు చేస్తామని హామీలు ఇచ్చారని.. ఏడాది గడిచినా ఒక్క హామీ కూడా అమలు కాలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా చంద్రబాబునాయుడు ఆటోడ్రైవర్లు, మోటారు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు జూలై 9న రాష్ట్రంలో ఆటోలు బంద్ చేసి ప్రభుత్వం కళ్లు తెరిపించాలన్నారు. కార్యక్రమంలో రావికృష్ణ, జి.నీలకంఠం, పి.సాయికుమార్, సూర్యారావు పాల్గొన్నారు.

పోలీస్ అవుట్‌పోస్టులతో నేరాల నియంత్రణ

వెస్ట్ సబ్‌డివిజన్ ఏసీపీ పృథ్వీతేజ



జ్ఞానాపురం రైల్వేస్టేషన్ వద్ద పోలీస్ అవుట్‌పోస్టును ప్రారంభిస్తున్న ఏసీపీ పథ్వీతేజ



అవుట్‌పోస్టు ప్రారంభించి, స్థానికులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీపీ

తాటిచెట్లపాలెం: నేరాల నియంత్రణకు పోలీస్ అవుట్‌పోస్టులు ఎంతగానో ఉపయోగపడతాయని వెస్ట్ జోన్ సబ్ డివిజన్ ఏసీపీ పృథ్వీతేజ తెలిపారు. జ్ఞానాపురం రైల్వేస్టేషన్ అవుట్ గేట్ సమీపంలో కంచరపాలెం పోలీసులు ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్‌పోస్టును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ రైల్వేస్టేషన్ పరిసరాల్లో నేరాలు నియంత్రించేందుకు పోలీస్ అవుట్‌పోస్టు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇక్కడ షిఫ్టల ప్రకారం రోజూ 9 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. సమీప ప్రాంతాల్లో ఫిర్యాదులపై తక్షణ స్పందన ఉంటుందన్నారు. కార్యక్రమంలో కంచరపాలెం పోలీస్‌స్టేషన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ సమీర్, రవికుమార్, దివ్యభారతి తదితరులు పాల్గొన్నారు.

29న విశాఖ అభివృద్ధి-నిధులు-సంస్కరణలపై సదస్సు

దాబాగార్డెన్స్: అభివృద్ధి, నిధులు, సంస్కరణలపై ఈ నెల 29న డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సు పోస్టర్‌ను అల్లూరి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ జీఎస్ రాజేశ్వరరావు, కమిటీ సభ్యులు బుజ్జి, సీహెచ్ సత్యనారాయణ, టి.కామేశ్వరరావులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ, ఈ సదస్సులో పలువురు ప్రముఖులు ప్రసంగించనున్నారని తెలిపారు.రాష్ట్రంలో అతిపెద్ద నగరమైన విశాఖ.. రాష్ట్ర విభజన తర్వాత గత పదేళ్లలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న ఐటీ పరిశ్రమలు తరలిపోయే పరిస్థితి ఏర్పడిందని, మెట్రో రైల్ వంటివి కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. విశాఖకు వెన్నెముక వంటి స్టీల్‌ప్లాంట్‌ను సైతం అమ్మకానికి పెడుతున్నారని ఆయన విమర్శించారు. గత దశాబ్ద కాలంలో రాష్ట్ర ఖజానా నుంచి జీవీఎంసీకి ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోగా, జీవీఎంసీ పన్నుల ఆదాయం రూ.350 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వాడుకుందని రాజేశ్వరరావు తెలిపారు. వృత్తి పన్ను ద్వారా జీవీఎంసీకి ఏడాదికి వచ్చే రూ.60 కోట్ల ఆదాయం రాష్ట్ర బడ్జెట్‌లోకి తరలిపోవడం వల్ల నిధులు లేక జీవీఎంసీ అప్పుల ఊబిలోకి కూరుకుపోతుందని చెప్పారు. ఈ సదస్సు ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని, నగర పౌరులు పెద్ద ఎత్తున పాల్గొని విశాఖ అభివృద్ధిపై చర్చలో పాలుపంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.